క్లుప్తంగా

నేడు టీటీడీ నీతి కథల పోటీలు

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కథ చెపుతారా? ఊ కొడతాం.. నీతి కథల పోటీలను వరంగల్ పిన్నావారి వీధిలోని శ్రీశారద ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు టీటీడీ డీపీపీ జిల్లా కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నీతికథల పోటీల్లో పాల్గొని కథలు, కాల్పనిక కథలు కాకుండా పురాణ, ఇతిహాస, చారిత్రక అంశాలకు సంబంధించిన కథలు చెప్పాలని సూచించారు. విజేతలకు నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆల్‌సింగ్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో పరిశోధకుడు అజుమీరా ఆల్‌సింగ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇండస్ట్రియల్ వర్కర్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం – ఏ కేస్ స్టడీ ఇన్ భారత డైనమిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి అజుమీరా ఆల్‌సింగ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం పర్యవేక్షణలో ఆల్‌సింగ్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

వీసీకి సీపీ అభినందన



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి న్యాక్ ఏప్లస్ గ్రేడ్ లభించిన నేపథ్యంలో కేయూలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ శుక్రవారం కలిసి అభినందించారు. కాకతీయ యూనివర్సిటీకి గొప్ప భవిష్యత్ ఉందని కొనియాడారు. ఈ సందర్భంగా సీపీని వీసీ సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్, పూలే ఆశయ సాధనకు కృషిచేయాలి

కేయూ క్యాంపస్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, పూలే ఆశయాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు సరిగొమ్ముల స్నేహలత కోరారు. కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలను శుక్రవారం సందర్శించగా, వారిని కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో వినయ్, అరవింద్, లికిత్ వినాయక్, వంశీ, సిద్ధార్థ, చంటి, వీరేష్, సందీప్, రాజు, శ్యామ్ పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

కరీమాబాద్: వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కమిషనర్‌ను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈక్రమంలోనే తమ డివిజన్ పరిస్థితులను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈదురు విక్టర్, మాజీ సర్పంచ్ పోషాల సదానందం, గ్రామ శాఖ అధ్యక్షుడు సారయ్య, కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించాలి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి కోరారు. హనుమకొండలోని ఓ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రేరణ ఫౌండేషన్ ఏకశిల పట్టణ మహిళా సహాయక బృందాల రిసోర్స్‌పర్సన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో విద్యాశాఖ పఠనోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రేరణ ఫౌండేషన్ రిసోర్స్‌పర్సన్లు ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు క్రీడలు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్స్ తదితర అంశాల్లో నైపుణ్యాలను పెంపొందిస్తూ వారికి సహాయ పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధ్యులు రమేష్, సోఫియా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ

హన్మకొండ: జిల్లాలో విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ హరిత హోటల్‌లో ఏబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన విద్యార్థి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులను పట్టిపీడిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏబీఎస్‌ఎఫ్ నాయకులు ప్రదీప్, పవన్ గౌడ్, మధుగౌడ్, వినయ్, కళ్యాణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మహిళలకు రక్షణ కరువు



కేయూలో లైబ్రరీ ఆవరణలో నిరసన తెలుపుతున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు



న్యూశాయంపేట: మాట్లాడుతున్న భిక్షపతి



ఖిలా వరంగల్: పడమరకోటలో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, తదితరులు



హన్మకొండ: కేంద్రం, మణిపూర్ ప్రభుత్వాల దిష్టి బొమ్మలను దహనం చేస్తున్న స్వేరోస్ నాయకులు

కేయూ క్యాంపస్: ఇటీవల మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై లైంగిక దాడికి పాల్పడి నగ్నంగా ఊరేగించిన అమానవీయ ఘటనను కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాలు శుక్రవారం తీవ్రంగా ఖండించాయి. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ఆవరణలో నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా కేయూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మంద వీరస్వామి మాట్లాడుతూ పాశవిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డేపల్లి మధు, అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంద నరేష్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన తలదించుకునేలా చేసింది

న్యూశాయంపేట: ఇటీవల మణిపూర్‌లో జరిగిన ఘటన దేశం, సభ్యసమాజం తలదించుకునేలా చేసిందని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ గిరిజన, ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో మాలోతు శంకర్ నాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, ఎం.భిక్షపతి, రమాదేవి, కేతావత్ రాములు, భూక్య స్వరూప, లకావత్ లక్ష్మి, దేవరాజుల శివశంకర్ పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

హన్మకొండ: మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలపై అత్యాచారం చేసి, నగ్నంగా ఊరేగించి, హత్య చేయడానికి యత్నించిన దుండగులను కఠినంగా శిక్షించాలని స్వేరో జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయి కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు స్వేరోస్ ఆధ్వర్యంలో కేంద్ర, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్తికేయన్, కిరణ్, సంజయ్ వర్మ, బన్నీ, శివ, నవీన్, ముఖేష్, సిద్ధార్థ, శ్రావణ్, శ్రీకాంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార దుండగులను అరెస్ట్ చేయాలి

ఖిలా వరంగల్: మణిపూర్‌లో మహిళలపై సామూహిక అత్యాచారం చేసి వీధుల్లో నగ్నంగా ఊరేగించిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమరకోట అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐద్వా జిల్లా కమిటీ నాయకురాలు భవాని ఆధ్వర్యంలో పలువురు మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరిగిన ఆటవిక చర్యను ప్రతీఒక్కరు ఖండించాలని సూచించారు. కార్యక్రమంలో అప్పాజీ, వాణి, అనిత, మౌనిక, ఇందిర, కొమురమ్మ, సామ్రాజ్యం, జగదీశ్వరి, కృష్ణవేణి, కల్పన, రాణి పాల్గొన్నారు.

నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం

ఖిలా వరంగల్: మణిపూర్‌లో మహిళలపై అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించిన దుండగులను కఠినంగా శిక్షించాలని సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ శంభునిపేట జంక్షన్‌లో టీపీసీసీ నేత నల్గొండ రమేష్ నేతృత్వంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. కార్యక్రమంలో ఇటికాల అశోక్, నారగోని మురళి, ఎండీ.లతీఫ్, బషీర్, బత్తుల కుమార్, సింగరి రాజ్‌కుమార్, మడిపల్లి కృష్ణ, చిప్ప వెంకటేశ్వర్లు, శివ, దాసరి రాజేష్, సాజిద్, మురళి, రజిత, రేణుక పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కేయూ క్యాంపస్: మణిపూర్‌లో జరిగిన దారుణ అఘాయిత్యాన్ని బీసీ విద్యార్థి సంఘం తీవ్రంగా ఖండిస్తోందని, నిందితులైన దుండగులను కఠినంగా శిక్షించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యూనివర్సిటీల ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి అభినందనలు



మహేందర్‌జీని సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న సర్వే ఉద్యోగులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌జీని టీఎన్జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, నాయకులు శ్యాంసుందర్, రామునాయక్, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

మహేందర్‌జీని కలిసిన సర్వే ఉద్యోగులు

హన్మకొండ అర్బన్: నూతనంగా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌జీని జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయ ఉద్యోగులు కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఐఓఎస్ సారంగపాణి, పవన్‌కుమార్, మండల సర్వేయర్లు ఎర్రప్రగడ, రాజేష్, స్టాలిన్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అదనపు కలెక్టర్

హసన్‌పర్తి: అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మహేందర్‌జీ.. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను శుక్రవారం కలిశారు. అలాగే, వరంగల్ ఆర్డీఓగా నియమితులైన వాసుచంద్ర కూడా ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

‘కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు’



మాట్లాడుతున్న రామస్వామి

రామన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడంలో పోటీ పడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి విమర్శించారు. నగరంలోని రామన్నపేటలోని రఘునాథ్ భవన్‌లో శుక్రవారం జరిగిన సీఐటీయూ 2వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం 4కోడ్‌లుగా మార్చేసి, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయ వాపోయారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసను కేంద్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ.మహిబూబ్ పాషా, కార్యదర్శి చేవుల శ్రీనివాస్, సింగారపు సుమన్, జన్ను యాకయ్య, బి.లలిత, కె.లక్ష్మణ్, బి.వీరస్వామి, పి.సునీత, ఆఫీస్ బేరర్లుగా 35 మంది కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అరూరి కుమార్, ఆర్.విజయ, సంగీత పాల్గొన్నారు.

తోళ్ల పరిశ్రమ కార్మికుల కడుపులు కొట్టొద్దు



మాట్లాడుతున్న తోళ్ల పరిశ్రమ కార్మికులు

దేశాయిపేట: కాలుష్య నియంత్రణ పేరుతో తోళ్ల పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు జీవనాధారం లేకుండా చేయవద్దని ట్యానరీ, లెదర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొత్తూరి యాకేందర్ కోరారు. తోళ్ల పరిశ్రమల వల్ల కాలుష్యం బారిన స్థానికులు పడుతున్నారని వరంగల్ పోలీసు కమిషనర్‌కు బీఎస్పీ నేత గంధం శివ ఫిర్యాదు చేయడంతో దేశాయిపేటలో తోళ్ల కార్మికులతో శుక్రవారం జరిగిన సమావేశంలో యాకేందర్ మాట్లాడారు. దేశాయిపేట, ఏనుమాముల పరిసర ప్రాంతాల ప్రజల ప్రధాన జీవనాధారం తోళ్ల పరిశ్రమలు అని చెప్పారు. దాదాపు 150 ఏళ్ల సంవత్సరాల నేపథ్యం కలిగిన తోళ్ల పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు రోడ్డున పడేసే విధంగా గంధం శివ ఫిర్యాదు ఉందని విమర్శించారు. సమావేశంలో నాయకులు సిద్దిక్ అహ్మద్(అఫ్రోజ్), జన్ను సుశీరాజ్, జన్ను స్వామి, ప్రసాద్, క్రిస్టఫర్, ప్రియాంక, స్వరూప, సృజన, సరోజ, ఆశ పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడికతీత



కాకాజీకాలనీలో పూడిక తీయిస్తున్న అధికారులు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్‌లోని డ్రెయినేజీల్లో నిండిన పూడికతీత పనులకు బల్దియా అధికారులు శ్రీకారం చుట్టారు. ఇటీవలి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మురుగు కాల్వల నుంచి వరదనీరు బయటకు రోడ్లపైకి వచ్చి ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో డ్రెయినేజీల్లోని చెత్తాచెదారం, వ్యర్థాలను జేసీబీలతో తొలగిస్తున్నారు.

బాధిత మహిళలకు అండగా ‘సఖి’



అవగాహన కల్పిస్తున్న లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి

హన్మకొండ చౌరస్తా: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను బాధిత మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి సూచించారు. హనుమకొండ మచిలీబజార్‌లోని కమ్యూనిటీ హాల్‌లో మహిళలు హక్కులు, న్యాయసేవా అంశాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత మహిళలు, బాలికలు సమస్యలపై ఫిర్యాదు, ఇతర న్యాయ సలహాల కోసం 0870 – 2452112 లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయవచ్చని చెప్పారు. సదస్సులో సఖి సెంటర్ కేస్ వర్కర్ వినీల, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీపై పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న అబ్బాస్

హసన్‌పర్తి: మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్రంలోని బీజేపీ విధానాలపై పోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు హసన్‌పర్తి మండల కేంద్రంలోని శుభమస్తు గార్డెన్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న శిక్షణ తరగతులకు అబ్బాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలను పీఎం మోదీ ప్రైవేట్‌పరం చేస్తూ ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కార్.. హామీలు అమలు చేయలేదని విమర్శించారు. మణిపూర్ ఘటనపై ప్రధాని స్పందన ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు నున్న నాగేశ్వర్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు వాసుదేవారెడ్డి, గాదె ప్రభాకర్‌రెడ్డి, ఎం.చుక్కయ్య, ఉప్పలయ్య, గొడుగు వెంకట్, వీరన్న, గుమ్మడి రాములు, నాయకులు సంపత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వీ హబ్ ఉద్యోగాల్లో గోల్‌మాల్!


- వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ పోస్టుల భర్తీలో అవకతవకలు
- ఇప్పటికే నాలుగు ఉద్యోగాల్లో రెండు అనర్హులకు..
- తాజాగా మరో పోస్టులోనూ విద్యార్హత పక్కనబెట్టారని చర్చ

సాక్షి, వరంగల్ : వరంగల్ జిల్లా సంక్షేమ శాఖలో చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అర్హులకు అందలం ఎక్కించారన్న విషయాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే కొత్త మిషన్ శక్తి పథకం కింద డిస్ట్రిక్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌కు సంబంధించి కాంట్రాక్ట్ బేసిస్‌కు చెందిన 4ఉద్యోగాల్లో 2అనర్హులకు కట్టబెట్టారని ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మరో నియామకం వివాదాస్పదం అవుతోంది. జిల్లా మిషన్ కోఆర్డినేటర్‌కు ఎంపికైన యువతి కూడా అదే సంక్షేమ విభాగం ఉద్యోగి బంధువు వద్ద పనిచేసిన వ్యక్తి కావడం చర్చకు దారితీస్తోంది. ఈ నియామకం పారదర్శకంగానే జరిగిందనుకున్నారు. కానీ, ఆ పోస్టుకు సంబంధించిన విద్యార్హత లేదని, అనుభవం పెద్దగా లేకున్నా సు‘కు మార’ంగా కానిచ్చారని పలువురు చర్చించుకుంటున్నారు. ములుగులో చైల్డ్‌లైన్‌లో ఓ ఎన్జీఓ తరఫున ఏడాదికి మించి పనిచేయని ఆమెకు అనుభవం మూడేళ్లు ఎలా వచ్చిందన్న ప్రశ్నలు వస్తున్నాయి. జిల్లా సంక్షేమ విభాగాధికారి కార్యాలయంలో పనిచేసే వ్యక్తి ఈ నియామకాల్లో కీలకంగా మారారని పలువురు పేర్కొంటున్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కమిటీ ఆధ్వర్యంలోనే ఉద్యోగాల నియామకం జరిగిందని జిల్లా సంక్షేమ విభాగాధికారి శారద తెలిపారు. తానే ఆ నియామకాలు చేపట్టలేదని ఆమె వివరించారు. కాగా, మెరిట్ లిస్టు అంతా తీసి కమిటీ ముందు ఉంచిన ఈ విభాగాధికారులే.. ఇప్పుడు జిల్లా కమిటీదే బాధ్యత అన్నట్లు మాట్లాడడం వెనుక ఆంతర్యమేమిటని ఆ శాఖ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

చైల్డ్‌లైన్‌లో ఇదే తీరట!

చైల్డ్‌లైన్–1098లో ప్రాజెక్టు కోఆర్డినేటర్, కౌన్సిలర్, మూడు చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్, మూడు కేసు వర్కర్.. మొత్తం 8 పోస్టులున్నాయి. ఈ ఉద్యోగాల నియామకాల్లోనూ అవకతవకలకు తెరలేపారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే చైల్డ్‌లైన్‌లో పనిచేసే వారికి ప్రాధాన్యం కల్పిస్తూనే కొత్తవారికి అవకాశం ఇవ్వాలనే నిబంధన ఉన్నా అవేమీ అధికారులు పట్టించుకోవడం లేదన్న టాక్ ఉంది.

ఘనంగా ‘నాయిని’ జన్మదిన వేడుకలు



హన్మకొండ చౌరస్తా: జీఎంహెచ్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు పండ్లు, దుప్పట్లను రాజేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని పెద్దమ్మగడ్డ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజేందర్‌రెడ్డి పుట్టిన రోజు సంబరాలను నిర్వహించారు.

కేయూ క్యాంపస్: నాయిని రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద నిర్వహించారు. రాజేందర్ రెడ్డి పాల్గొని కేక్ కట్‌చేశారు.

హన్మకొండ: హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని గోకుల్ కూడలిలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళయాదవ్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్‌యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

నయీంనగర్: రాజేందర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా 53వ డివిజన్ లష్కర్ సింగారంలో గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యదర్శి ఎర్ర మహేందర్, కావ్య ఆధ్వర్యంలో కూరగాయలు పంపిణీ చేశారు.

సంక్షిప్తంగా

ఓటరు జాబితాను సరిచేయాలి

హసన్‌పర్తి: ఓటరు జాబితాలో దొర్లిన తప్పులను సరిచేయాలని తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు సూచించారు. హసన్‌పర్తి మండల పరిషత్ సమావేశపు మందిరంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తహసీల్దార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రణయ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ ఏఆర్‌ఆర్‌నగర్ కాలనీలో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది శుక్రవారం ప్రత్యేక గ్యాంగ్‌వర్క్ పనులు చేపట్టారు. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో దోమలు, ఈగల వ్యాప్తి పెరిగి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గడ్డి మందును సిబ్బంది పిచికారీ చేశారు. కార్పొరేటర్ విజయశ్రీ, రజాలీతో పాటు కాలనీపెద్దలు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

ఖిలా వరంగల్: వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ గద్దె బాబు సూచించారు. ఈమేరకు వరంగల్ 17వ డివిజన్ గాడిపెల్లి గ్రామంలో మండల ఆర్‌ఐతో కలిసి ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కూలిన ఇళ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో జనుపాల రాంబాబు, కుమారస్వామి, వీరస్వామి, విలాసాగరం సారయ్య, సదానందం, మధు, సూరయ్య, భాస్కర్, రమేష్ హరీష్, శ్రీను, సునీల్ పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో కుర్చీల ఏర్పాటు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికులకు రైల్వే అధికారులు ఇనుప కుర్చీలను ఏర్పాటు చేశారు. ప్రయాణికుల వెయిటింగ్ హాల్‌లో పునరుద్ధరణ పనులు చేస్తున్నందున ఒకటవ నంబర్ ప్లాట్‌ఫాంపై కుర్చీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా, ప్లాట్‌ఫాంపై కుర్చీలను అలాగే ఉంచాలని పలువురు కోరుతున్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

కాజీపేట అర్బన్: వాహనాలు నడిపే ప్రతీఒక్కరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు. డివిజన్ పరిధిలోని న్యూశాయంపేటలోని కార్పొరేటర్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన సొంత డబ్బులతో డివిజన్‌లోని 40మంది యువకులకు ఆర్టీఏ కార్యాలయం నుంచి డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేసినట్లు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



మామునూరు: పోచమ్మ, నాగమయ్య దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ చింతల యాదగిరి అన్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని చింతల యాదగిరిని అల్లీపురం గ్రామ ప్రజలు అభ్యర్థించగా, ఆయన స్పందించి సొంత ఖర్చులతో బోరు వేసి విద్యుత్ మోటార్‌ను శుక్రవారం బిగించారు. కార్యక్రమంలో బోగవెల్లి మధుకర్‌రావు, ముప్ప సతీష్, కిషన్, బొల్ల బాబు, బుస్స వెంకన్న, రాజేశ్వర్‌రావు, ప్రసాద్‌రావు, లక్కరాణి, యశోద, లావణ్య అరుణ పాల్గొన్నారు.

బస్టాండ్ అభివృద్ధికి కృషి

హసన్‌పర్తి: హసన్‌పర్తి బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో వరదనీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈక్రమంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వీబీఓ (విలేజ్ బస్ ఆఫీసర్) మేకల యుగంధర్ శుక్రవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ (కేయూ) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం వద్ద శుక్రవారం మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు, జేఏసీ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకట గోపీనాథ్, కోకన్వీనర్ డాక్టర్ మంతెన శంకరయ్య, జేఏసీ అధికార ప్రతినిధి డాక్టర్ రాధిక, కోఆర్డినేటర్ డాక్టర్ నాగేశ్వర్‌రావు, బాధ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

హసన్‌పర్తి: హనుమకొండ–హసన్‌పర్తి ప్రధాన రహదారిలోని రామారం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ స్కూల్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం..హనుమకొండ మచిలీబజార్‌కు చెందిన పెరుమాండ్ల జయప్రకాష్(52) ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి కాలినడకన రామారం సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా భీమారం నుంచి చింతగట్టు వైపునకు వెళ్తున్న ద్విచక్రవాహనం వేగంగా వచ్చి జయప్రకాష్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో జయప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడు వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి

మామునూరు: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం గ్రామ పరిధిలోని పెన్షన్‌పురం గ్రామానికి చెందిన 102 సంవత్సరాల శతాధిక వృద్ధుడు, టీఎస్‌ఎస్పీ రిటైర్డ్ ఆర్‌ఎస్సై మహ్మద్ జలీల్ హైమద్ గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈమేరకు టీఎస్‌ఎస్పీ రిటైర్డ్ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగరాజు ప్రకాశ్, గౌరవ అధ్యక్షుడు చెలిమల సత్తయ్య, ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి, పలువురు అధికారులు సంతాపం తెలిపారు.

స్వయం ఉపాధితో ముందుకు..

కాజీపేట: ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకోవడానికి యువత ముందుకు రావడం అభినందనీయమని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. కాజీపేట పట్టణంలో కొక్కొండ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన రెడ్ బిర్యానీ పాయింట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాస్టర్ ఐజాక్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, రిటైర్డ్ డీఎస్పీ మునిగాల విలియం, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

కాశిబుగ్గ: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకుల దుష్ప్రచారాలను బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్స్ ఎప్పటికప్పుడూ తిప్పికొట్టాలని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. ఓ సిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

కాశిబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బంజారా భవన్‌కు స్థలం కేటాయించాలని రంగశాయిపేటకు చెందిన బంజారా నాయకులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

హెర్నియా – శస్త్ర చికిత్స పద్ధతులపై శిక్షణ



ప్రారంభోత్సవంలో వైద్యులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కుడా కార్యాలయం రోడ్డులోని కూరపాటి ఆస్పత్రిలో హెర్నియా సమస్యలకు లాపరోస్కోపీ శస్త్ర చికిత్స పద్ధతులపై వైద్యులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న తరగతులకు ముఖ్య అతిథులుగా వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాకేష్, కార్యదర్శి డాక్టర్ సనత్‌కుమార్ హాజరై మాట్లాడారు. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో వైద్యులు ముందుండాలని, అప్పుడే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో కూరపాటి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రమేష్, వైద్యులు అశోక్‌రెడ్డి, రవీందర్, సుధాకర్, అత్యున్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాజేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)